క్లుప్తంగా

సత్యనారాయణపురంలో అగ్నిప్రమాదం



నెల్లూరు సిటీ: విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్నిప్రమాదం సంభవించిన ఘటన సత్యనారాయణపురంలో బుధవారం చోటుచేసుకుంది. వివరాలు.. జాకీర్‌హుస్సేన్‌నగర్‌లోని సత్యనారాయణపురంలో శ్రీహరినాయుడు, కాంతమ్మ నివాసం ఉంటున్నారు. ఈ క్రమంలో షార్ట్ సర్క్యూట్‌తో ఇంట్లోని గృహోపకరణాలు అగ్నికి ఆహుతయ్యాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక శాఖ సిబ్బంది ఘటన స్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు.

డిపాజిట్ పేరిట మోసం

నెల్లూరు సిటీ: డిపాజిట్ పేరిట ఓ విశ్రాంత అధ్యాపకుడి నుంచి రూ.పది లక్షలకుపైగా కాజేసిన ఘటన వెలుగులోకి వచ్చింది. వివరాలు.. నవాబుపేటకు చెందిన విశ్రాంత అధ్యాపకుడు జయరామయ్య 2019లో ఉద్యోగ విరమణ పొందాక వచ్చిన నగదుతో దర్గామిట్టలోని ఎస్‌బీఐ లైఫ్ ఇన్సురెన్స్‌లో భార్య పేరుపై పాలసీ చేశారు. కొద్ది రోజుల అనంతరం జయరామయ్య ఇంటికి హనుమంతరావు అనే వ్యక్తి వచ్చారు. తాను ఇన్సురెన్స్ పాలసీ వేసిన బ్రాంచ్‌కు మేనేజర్‌నని పరిచయం చేసుకున్నారు. మీరు కట్టిన పాలసీతో పెద్దగా బెనిఫిట్స్ రావని.. తాను సూచించిన మేరకు డిపాజిట్ చేసుకుంటే అధిక వడ్డీలు వస్తాయని నమ్మబలికారు. ఈ మాటలను నమ్మి పాలసీని జయరామయ్య రద్దు చేసుకున్నారు. ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయిస్తానని చెప్పడంతో దాదాపు రూ.పది లక్షలను హనుమంతరావు ఖాతాకు బదిలీ చేశారు. బాండ్లను జయరామయ్యకు ఇచ్చారు. ఇటీవల జయరామయ్య ఆరోగ్యం సక్రమంగా లేకపోవడంతో డిపాజిట్ చేసిన నగదు అవసరమని హనుమంతరావుకు ఫోన్ చేశారు. అయితే ఫోన్ స్విచ్ఛాఫ్ రావడంతో దర్గామిట్టలోని బ్రాంచ్‌కు వెళ్లి ఆరా తీయగా, హనుమంతరావు మోసగాడని తేలింది. బాధితుడి ఫిర్యాదు మేరకు నవాబుపేట పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కత్తితో బెదిరించి నగదు దోపిడీ

నెల్లూరు సిటీ: నగరంలోని ఎమ్ – 2 థియేటర్స్ రోడ్డులో వెళ్తున్న వ్యక్తిని కత్తితో బెదిరించి నగదును దోచుకున్న ఘటన బుధవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. హరనాథపురానికి చెందిన వెంకటేష్ ఎమ్ – 2 థియేటర్స్ రోడ్డు మీదుగా ఏసీ కూరగాయల మార్కెట్ వైపు నడిచి వెళ్తున్నారు. మూలాపేటకు చెందిన ప్రసన్నకుమార్, లోకేష్ ఆయన్ను వీఆర్ లా కళాశాల వద్ద అడ్డుకొని నగదును ఇవ్వాలని బెదిరించి రూ.వెయ్యిని లాక్కున్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు చిన్నబజార్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆక్రమణదారులపై కేసులు నమోదు

నెల్లూరు సిటీ: ఆక్రమణదారులపై వేదాయపాళెం పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. శాంతినగర్‌కు చెందిన శ్రీలక్ష్మి అక్క ఇందిరమ్మకు అంబాపురంలో 20 ఎకరాల భూమి ఉంది. ఈ భూమిని ఆమె తన చెల్లెలు శ్రీలక్ష్మి పేరుపై రిజిస్ట్రేషన్ చేశారు. స్థానికంగా ఉండే కొందరు ఆ భూమిలోకి అక్రమంగా ప్రవేశించి గుడిసెలు వేశారు. దీనిపై చర్యలు చేపట్టాలని పోలీసులకు శ్రీలక్ష్మి ఫిర్యాదు చేశారు.

- ఓగురుపాడుకు చెందిన విజయరామిరెడ్డి, అతని బంధువులు, కుటుంబసభ్యుల పేరుపై అక్కచెరువుపాడులో సుమారు 40 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. అక్కచెరువుపాడు గ్రామస్తులు సదరు భూమిలోకి అక్రమంగా ప్రవేశించి గుడిసెలు వేయడంతో పాటు తాటి చెట్లను దహనం చేశారు. దీంతో ఆక్రమణకు పాల్పడిన వ్యక్తులపై వేదాయపాళెం పోలీసులకు విజయరామిరెడ్డి ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చర్యలకు వినతి

నెల్లూరు రూరల్: అక్కచెరువుపాడులో తమ భూములను ఆక్రమించేందుకు యత్నిస్తున్న వారిపై కఠిన చర్యలు చేపట్టాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత విజయరామిరెడ్డి కోరారు. ఈ మేరకు పలువురు పార్టీ నేతలతో కలిసి విలేకరులతో బుధవారం ఆయన మాట్లాడారు. సర్వే నంబర్ 55 – 1, 55 – 2లో 40 ఎకరాల భూమి ఉందని, దీనికి సంబంధించి రెవెన్యూ రికార్డుల్లో తమ పేర్లు ఉన్నాయని చెప్పారు. ఎంతో కాలంగా భూములను సాగు చేసుకుంటున్నామన్నారు. అయితే స్థానంలో ఉన్న పలువురు భూముల్లో ఆక్రమణలకు పాల్పడ్డారని చెప్పారు. దీనిపై వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేశామని పేర్కొన్నారు. హరిశ్చంద్రారెడ్డి, జనార్దన్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

బుచ్చిరెడ్డిపాళెం: నగర పంచాయతీ పరిధిలోని వవ్వేరులో నెల్లూరు కిమ్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో బుధవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. స్థానిక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత కోటంరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి సహకారంతో నిర్వహించిన శిబిరంలో డాక్టర్ రమాదేవి దాదాపు 100 మందికి వైద్య పరీక్షలను నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు.

ఒంటరిగా పోటీ చేసే ధైర్యం లేక విమర్శలా..?

- ఎమ్మెల్యే అనిల్‌కుమార్



సమస్యలను ఆరాతీస్తున్న అనిల్‌కుమార్

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): రాష్ట్రంలోని 175 స్థానాల్లో ఒంటరిగా పోటీ చేసే ధైర్యం లేని టీడీపీ నేతలు తమపై విమర్శలు చేయడం సిగ్గుచేటని నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ విమర్శించారు. నగరంలోని తొమ్మిదో డివిజన్లో గల బంగ్లా తోట, తదితర ప్రాంతాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. డివిజన్లోని ప్రతి ఇంటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలు తీరును ఆరాతీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సర్వేపల్లి కాలువపై నివసిస్తున్న వారి ఇళ్లకు గత ప్రభుత్వ హయాంలో మార్కింగ్ వేసి భయభ్రాంతులకు గురిచేశారని ఆరోపించారు. అయితే ఎవరిళ్లను తొలగించకుండా లైనింగ్ పనులను తాము చేశామని చెప్పారు. రైల్వే స్థలాల్లోని ఇళ్లను తొలగిస్తామని అధికారులు హెచ్చరించినా, వారికి టీడీపీ నేతలు భరోసా కల్పించని అంశాన్ని ప్రస్తావించారు. తాను కోర్టుకెళ్లి స్టేను తీసుకొచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. ఆ సమయంలో నోరు మెదపని వారంతా ఇప్పుడు ఇష్టానుసారంగా మాట్లాడుతుండటం సిగ్గుచేటని విమర్శించారు. మైపాడు రోడ్డును వెడల్పు చేసే పనులు జరుగుతున్నాయని, వీరికి ఎలాంటి ఇబ్బందుల్లేకుండా చర్యలు చేపడతామని చెప్పారు. అభివృద్ధి పనులు జరగడంలేదంటూ మాట్లాడటం టీడీపీ నేతలకు అలవాటైపోయిందని మండిపడ్డారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ డివిజన్ ఇన్‌చార్జి శ్రీనివాసులురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం




మాట్లాడుతున్న విజయ్‌కుమార్

- ప్లానింగ్ శాఖ రాష్ట్ర కార్యదర్శి విజయ్‌కుమార్

నెల్లూరు (పొగతోట): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఐక్యరాజసమితి సూచించిన ప్రమాణాలకు దగ్గరగా ఉన్నాయని, అన్ని వర్గాల అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని ప్లానింగ్ శాఖ రాష్ట్ర కార్యదర్శి విజయ్‌కుమార్ పేర్కొన్నారు. సుస్థిర అభివృద్ధి లక్ష్యసాధనకు చేపట్టాల్సిన చర్యలపై ఉద్యోగ సంఘాలు, వివిధ వర్గాలకు చెందిన నేతలు, ఎన్జీఓలతో స్థానిక జెడ్పీ సమావేశ మందిరంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అందరికీ ఆహారం, ఆరోగ్యం, విద్య, మౌలిక వసతులు, ఉపాధి కల్పన, తదితర అంశాలను అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రత్యేక చర్యలను చేపడుతోందని చెప్పారు. ప్రజలకు మరింత మెరుగైన సంక్షేమ కార్యక్రమాలను అమలు చేసేందుకు గానూ అందరి సూచనలు, సలహాలను స్వీకరిస్తున్నామని పేర్కొన్నారు. అనంతరం అభిప్రాయాలను తెలుసుకున్నారు. పలు సంఘాల వారు వివిధ సమస్యలను తెలియజేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వోద్యోగ సంఘ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రమణారెడ్డి, మల్లికార్జున, జాతీయ వడ్డెర సంఘ మహిళాధ్యక్షురాలు నిర్మల, గిరిజన సంక్షేమ సంఘ నేత పెంచలయ్య, జెడ్పీ సీఈఓ చిరంజీవి, సీపీఓ సాల్మన్‌రాజు, తదితరులు పాల్గొన్నారు.

కోదండరాముడికి ప్రణామం

శ్రీరామనవమిని పురస్కరించుకొని సీతాదేవి, కోదండరామస్వామికి సింహపురికి చెందిన కళాకారులు కళారూపాలతో ప్రణమిల్లారు. - నెల్లూరు(బృందావనం)



భక్తవత్సలనగర్‌కు చెందిన కార్పెంటర్ శ్రీనివాసులు 170 రంగు రంగుల గుండీలతో కల్యాణ మండపానికి రూపునిచ్చి సీతారాముల కల్యాణ ఘట్ట చిత్రాన్ని తీర్చిదిద్దారు.



హరనాథపురానికి చెందిన సూక్ష్మ చిత్రకారుడు పద్మారత్నం తన కళానైపుణ్యంతో పచ్చ ద్రాక్ష పండు, క్యారెట్ ముక్కలపై శ్రీరాముడి రూపాలను జెల్ పెన్‌తో తీర్చిదిద్దారు.

మిస్ నెల్లూరుకు సత్కారం



నెల్లూరు(బృందావనం): మిస్ నెల్లూరు లతీఫా, రన్నర్స్‌గా నిలిచిన వర్షితను వీఆర్సీ సెంటర్‌లోని శుభమస్తు షాపింగ్ మాల్‌కు బుధవారం సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా వీరిని ఘనంగా సత్కరించారు. కాస్ట్యూమ్ డిజైనర్ రవళి, స్టార్ ఈవెంట్స్ రాజు, చిత్రకారుడు అమీర్‌జాన్, తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ ఏర్పాట్ల పరిశీలన

నెల్లూరు(బారకాసు): నగరంలోని 33వ డివిజన్ పరిధిలో గల మసీదుల వద్ద రంజాన్ ఏర్పాట్లను మేయర్ స్రవంతి బుధవారం పరిశీలించారు. కార్పొరేటర్ మంజుల పాల్గొన్నారు.

వేడుకగా పుత్రకామేష్టి యాగం





నెల్లూరు(బృందావనం): బాలాజీనగర్‌లోని అనంత కోదండరామస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల ప్రారంభ సందర్భంగా పుత్రకామేష్టి యాగాన్ని మాచవోలు కోటేశ్వరశర్మ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. వివిధ రాష్ట్రాల నుంచి 180 మందికిపైగా దంపతులు హాజరయ్యారు. పలు ఆలయాల నుంచి దేవదేవేరులు తరలివచ్చారు. ఉభయకర్తలుగా కరుణమ్మ, వెంకటేశ్వర్లుగుప్తా, గీతాంజలి, సురేంద్రనాథ్ గుప్తా, అన్నపూర్ణ దంపతులు, భారతి, విష్ణుతేజ, చిన్మయి వ్యవహరించారు. నిర్వాహకులు మోహన్‌రావు, కిషోర్‌కుమార్, వెంకటరత్నం, మస్తాన్‌రావు, సత్యం, పూర్ణచంద్రరావు, సుకుమార్, ఆంజనేయులు, తదితరులు పర్యవేక్షించారు.

అదనపు కట్నం కోసం వేధింపులు

నెల్లూరు సిటీ: అదనపు కట్నం కోసం వేధింపులకు గురిచేస్తున్న భర్త, అత్తింటి వారిపై నవాబుపేట పోలీసులు కేసును బుధవారం నమోదు చేశారు. పోలీసుల వివరాల మేరకు.. వెంకటేశ్వరపురంలోని చిన్న మసీదు వీధికి చెందిన నారాయణరావుకు తోటపల్లిగూడూరు మండలానికి చెందిన పవిత్రతో 2020లో వివాహమైంది. ఆ సమయంలో కట్నకానుకలను పవిత్ర కుటుంబసభ్యులిచ్చారు. కొంతకాలం వీరి కాపురం సజావుగా సాగింది. అనంతరం అదనపు కట్నం కోసం భర్త, కుటుంబసభ్యులు ఆమెను వేధింపులకు గురిచేయడం ప్రారంభించారు. ఈ క్రమంలో ప్రసవానికి పుట్టింటికెళ్లిన ఆమె వెంకటేశ్వరపురంలోని అత్తింటికి ఆదివారం వచ్చారు. పవిత్ర, ఆమె తల్లి పద్మమ్మను ఇంట్లోకి రానివ్వకుండా వారు అడ్డుకున్నారు. అదనపు కట్నాన్ని తీసుకొస్తేనే ఇంట్లోకి ప్రవేశం ఉంటుందని తేల్చిచెప్పారు. దీంతో పోలీసులకు ఆమె ఫిర్యాదు చేశారు. నారాయణరావుతో పాటు అతని కుటుంబసభ్యులు నరసింహులు, కామేశ్వరమ్మ, సాయిరామ్, సాయిలతపై పోలీసులు కేసు నమోదు చేశారు.

అంబాపురంలో రెండో రోజూ ఉద్రిక్తత

నెల్లూరు రూరల్: అంబాపురంలోని ఖాళీ స్థలాల వద్ద బుధవారం సైతం ఉద్రిక్తత నెలకొంది. గుడిసెలు వేసేందుకు పలువురు యత్నించడంతో ఇరు వర్గాలు గొడవపడ్డారు. ఈ క్రమంలో రూరల్ ఇన్‌చార్జి తహసీల్దార్ సుబ్బయ్య అభ్యర్థన మేరకు నగర డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, వేదాయపాళెం ఇన్‌స్పెక్టర్ వెంకటనారాయణ తమ సిబ్బందితో కలిసి ప్రాంతానికి చేరుకొని పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చేందుకు చర్యలు చేపట్టారు. గుడిసెలు వేసేందుకు యత్నించిన 33 మందిని అదుపులోకి తీసుకున్నారు. వీరిని పోలీస్‌స్టేషన్‌కు తరలించి స్టేషన్ బెయిల్‌పై విడుదల చేశారు. ఆక్రమించిన ప్రాంతం ప్రభుత్వ స్థలమని, ఈ విషయంలో చర్యలు తప్పవని రూరల్ ఇన్‌చార్జి తహసీల్దార్ పేర్కొన్నారు. స్థలంలో ఉన్న ఆక్రమణలను త్వరలో తొలగించనున్నామని చెప్పారు.

సీతారాముల కల్యాణం చూతము రారండి



జర్మన్ టెక్నాలజీతో తీర్చిదిద్దిన కల్యాణోత్సవ ప్రాంగణం



విద్యుద్దీపాలంకరణలో శబరి శ్రీరామక్షేత్రం

శ్రీరామనవమిని పురస్కరించుకొని నగరంలోని శబరి శ్రీరామక్షేత్రంలో విశేష పూజా కార్యక్రమాలను గురువారం నిర్వహించనున్నారు. కల్యాణోత్సవాన్ని ఐదు వేల మంది భక్తులు వీక్షించేలా శ్రీరామకోటి స్తూప ప్రాంగణంలో విశాలమైన వేదికను ఏర్పాటు చేశారు. అన్నప్రసాద వితరణ సజావుగా జరిగేలా టీటీడీ కల్యాణ మండపంలో బ్యారికేడ్లతో క్యూలైన్లు, షామియానాలను ఏర్పాటు చేశారు. దేవతామూర్తుల చిత్రాలను విద్యుద్దీపాలంకరణలో తీర్చిదిద్దారు.

– నెల్లూరు(బృందావనం)

ఘనంగా పంచవృత్తుల పతాకావిష్కరణ



నెల్లూరు(బృందావనం): విరాట్‌నగర్‌లోని వీబీఎస్ కల్యాణ మండప ప్రాంగణంలో నెల్లూరు పట్టణ విశ్వ బ్రాహ్మణ సేవా సంఘ వార్షికోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. వీరబ్రహ్మేంద్రస్వామి దేవస్థాన ఎదుట పంచవృత్తుల పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం స్వామివారికి పూజలు చేశారు. సంఘ శాశ్వత వ్యవస్థాపక అధ్యక్షుడు చెంగయ్య ఆచారి, తదితరులు పర్యవేక్షించారు.

సాయినాథుడి దివ్య రథోత్సవం నేడు

నెల్లూరు(బృందావనం): శ్రీరామనవమిని పురస్కరించుకొని బాలాజీనగర్ సమీపంలోని సాయిదర్బార్ అద్దాల మందిరంలో విశేష కార్యక్రమాలను గురువారం నిర్వహించనున్నామని మందిర మేనేజింగ్ ట్రస్టీ మధుసాయి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం ఐదుకు కాకడ హారతి, ఆరుకు సాయినాథుడికి ప్రత్యేకాభిషేకాలు, ఓం సాయి శ్రీసాయి జయజయ సాయి అఖండ సాయినామ సంకీర్తనను నిర్వహించనున్నామని చెప్పారు. సాయిమాత నిత్యాన్నప్రసాదాలయం, సాయి సేవాలయంలో సీతారామచంద్రుల కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించనున్నామని చెప్పారు. సాయినాథుడి నగరోత్సవాన్ని జరపనున్నామని వివరించారు. భక్తులు తరలిరావాలని కోరారు.

రంగడి సన్నిధిలో శ్రీరామనవమి

నగరంలోని తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో శ్రీరామనవమిని నిర్వహించనున్నామని ఈఓ వెంకటేశ్వర్లు తెలిపారు. గురువారం ఉదయం ఎనిమిది గంటలకు సీతారామచంద్రస్వామి వారికి తిరుమంజనం, 11కు సీతారాముల కల్యాణం, హనుమంతసేవ, తదితరాలను నిర్వహించనున్నామన్నారు.

ఆలయాల్లో విశేష పూజలు

నెల్లూరు(బృందావనం): రాష్ట్ర దేవదాయ శాఖ సలహాదారుడు జ్వాలాపురం శ్రీకాంత్ దంపతులు నగరంలోని వివిధ ఆలయాల్లో విశేష పూజలను బుధవారం నిర్వహించారు. సింహపురి గ్రామదేవత ఇరుకళల పరమేశ్వరి అమ్మవారు, తల్పగిరి రంగనాథస్వామి, రాజరాజేశ్వరి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈఓలు పెంచలప్రసాద్, వెంకటేశ్వర్లు, గిరికృష్ణ, ధర్మకర్తల మండళ్ల చైర్మన్లు శ్రీనివాసరావు, శివకుమార్‌ఆచారి, రత్నం జయరామ్, తదితరులు స్వాగతం పలికారు. బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య రాష్ట్ర అర్చక విభాగ ఉపాధ్యక్షుడు శ్రీధర్‌శర్మ, ప్రధాన కార్యదర్శి ప్రసాద్, జిల్లా అర్చక సమాఖ్య, బ్రాహ్మణ నేతలు రాజా, వెంకటశేషాచార్యులు, బాలాజీ, నరహరి, గోపాల్, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

'నారాయణ' విద్యార్థులకు బహుమతులు



నెల్లూరు (టౌన్): జేఎన్టీయూ పరిధిలోని వివిధ ఇంజినీరింగ్ కళాశాలల్లో నిర్వహించిన నేషనల్ లెవల్ స్టూడెంట్స్ టెక్నికల్ సింపోజియం పోటీల్లో నారాయణ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ మెకానికల్ చదువుతున్న విద్యార్థులు ప్రథమ, ద్వితీయ బహుమతులను సాధించారు. వీరిని బుధవారం అభినందించిన అనంతరం కళాశాల డైరెక్టర్ ప్రసాద్ మాట్లాడారు. చిత్తూరులోని వేము ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన పేపర్ ప్రజంటేషన్, ప్రాజెక్ట్ ఎక్స్‌పోలో నిఖేష్, దినేష్ ప్రథమ బహుమతిని సాధించారని చెప్పారు. విద్యానగర్‌లోని ఎన్బీకేఆర్ కళాశాలలో నిర్వహించిన పోటీల్లో గుర్నాథ్ ద్వితీయ బహుమతిని సాధించారన్నారు. అనంతపురంలోని జేఎన్టీయూలో నిర్వహించిన పోటీల్లోనూ ఉత్తమ ప్రతిభను చూపారని చెప్పారు. కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసులురెడ్డి, మెకానికల్ హెచ్ఓడీ శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

నేత్రదానం



నెల్లూరు (అర్బన్): పొదలకూరు రోడ్డులోని టైలర్స్ కాలనీకి చెందిన భద్రమ్మ (78) మంగళవారం మృతి చెందారు. కుటుంబసభ్యుల అంగీకారంతో ఆమె నేత్రాలను ఎల్వీ ప్రసాద్ ఐ హాస్పిటల్ టెక్నీషియన్ లాలేష్ సేకరించారు. అనంతరం నేత్రదాన సర్టిఫికెట్‌ను అందజేశారు. నేత్రదానం చేయాలనుకునే వారు 99481 64781, 93471 11033 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

భక్తిశ్రద్ధలతో ధ్వజారోహణ

నెల్లూరు(వీఆర్సీసెంటర్): గాంధీ గిరిజన కాలనీలో కొలువైన రామాలయంలో నిర్వహిస్తున్న శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా ధ్వజారోహణను భక్తిశ్రద్ధలతో బుధవారం జరిపారు. ఉభయకర్తలుగా వెంకటరమణ దంపతులు వ్యవహరించారు. ఎస్సై వెంకయ్య, రవి, చంద్ర, ప్రభాకర్, ఆలయ అర్చకుడు శేషయ్య, తదితరులు పాల్గొన్నారు.

చీటింగ్ కేసులో ఇద్దరికి ఏడాది జైలు

నెల్లూరు(లీగల్): ఫోర్జరీ సంతకంతో లేఖను సృష్టించి నగదును కాజేసిన కేసులో నేరం రుజువు కావడంతో ముత్తుకూరు మండలం నేలటూరుకు చెందిన శ్రీనివాసులురెడ్డి, ఏపీజీబీ శ్రీనివాసాగ్రహారం బ్రాంచ్ మేనేజర్ రామసుబ్బారావుకు ఏడాది జైలుతో పాటు రూ.3.8 లక్షలను ఫిర్యాదికి పరిహారంగా చెల్లించాలని నెల్లూరు ఐదో అదనపు మేజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి దేవిక బుధవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు.. రంగనాయకులపేటలోని ఆనకట్ట రోడ్డుకు చెందిన శ్రీధర్ విద్యుత్ ఎస్ఈ కార్యాలయంలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా కాంట్రాక్ట్ ప్రాతిపదికన పనిచేస్తున్నారు. శ్రీనివాసాగ్రహారంలోని ఏపీజీబీలో 2006, జూన్ 23న ఖాతాను ప్రారంభించారు. 2010, మార్చి 13న తన ఖాతా నుంచి రూ.1,36,500 మేర తగ్గిందని గుర్తించి బ్యాంక్ మేనేజర్‌కు ఫిర్యాదు చేశారు. పరిశీలించి శ్రీనివాసులురెడ్డి ఖాతాలో జమైందని గుర్తించారు. కాగా సదరు మొత్తాన్ని తండ్రి శ్రీనివాసులురెడ్డికి బదిలీ చేయమని లేఖను రాసిచ్చారంటూ మేనేజర్ చూపారు. దీంతో ఫిర్యాది తన తండ్రి పేరు యానాటి శ్రీనివాసులురెడ్డి కాదని.. వైవీ కృష్ణారెడ్డి అని పాస్‌బుక్‌లో ఉన్న అంశాన్ని మేనేజర్‌కు తెలిపారు. వ్యవహారంలో మేనేజర్ పాత్ర ఉందని గ్రహించిన ఫిర్యాది బ్యాంక్ ఉన్నతాధికారులు, బ్యాంకింగ్ అంబుడ్స్‌మెన్‌కు ఫిర్యాదు చేసినా ప్రయోజనం లభించలేదు. దీంతో శ్రీనివాసులురెడ్డి, రామసుబ్బారావుపై బాలాజీనగర్ పోలీస్‌స్టేషన్లో 2012 సెప్టెంబర్ 29న ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు అనంతరం ఇద్దరిపై కోర్టులో చార్జిషీట్‌ను దాఖలు చేశారు. విచారణలో నేరం రుజువు కావడంతో పైమేరకు న్యాయమూర్తి తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున ఏపీపీ ప్రకృతికుమార్ కేసు వాదించారు.